షూటింగ్ చాంపియన్ సయ్యద్ మునావర్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) వేదికగా జరిగిన స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్ఎఫ్ఏ) షూటింగ్ చాంపియన్‌షిప్‌లో యువ షూటర్ సయ్యద్ మునావర్ హుస్సేన్ 10మీటర్ల విభాగంలో స్వర్ణ పతకంతో మెరిశాడు.

ఏషియన్ ముక్తా సంస్థలకు టోకరా

బోగస్ బ్యాంక్ అకౌంట్లతో ఉద్యోగి మోసం

సినీ నిర్మాత ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు

బంజారాహిల్స్, అక్టోబర్ 26: బోగస్ కంపెనీల పేర్లతో బ్యాంక్ అకౌంట్లను సృష్టించి.. ప్రముఖ సినీ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ సునీల్ నారంగ్‌కు చెందిన అకౌంట్‌నుంచి డబ్బులు కాజేసిన ఉద్యోగితో పాటు మరో ఇద్దరిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదయింది. పోలీసుల వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నం. 31లో ఏషియన్ ముక్తా ఏ-2 సంస్థ పేరుతో నిర్మాత సునీల్ నారంగ్ కార్యాలయం నడిపిస్తున్నారు. ఇందులో విశ్వనాథరెడ్డి అనే వ్యక్తి గత ఏడేళ్లుగా అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. కాగా.. గత కొన్నేళ్లుగా విశ్వనాథరెడ్డి.. తన భార్య సఫియా నసీర్, స్నేహితుడు శశాంక్‌తో కలిసి కొన్ని బోగస్ సంస్థల పేర్లతో బ్యాంక్ అకౌంట్లు తెరిచారు. హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్, సాయి నైన్ ఎంటర్ ప్రైజెస్, తదితర పేర్లతో ఉన్న ఈ బ్యాంకు ఖాతాలకు పలు సందర్భాల్లో డబ్బులు పంపించారు. బోగస్ లెక్కలు చూపిస్తూ ఆయా సంస్థల పేర్లమీదకు రూ.1.47కోట్ల మేర నిధులు పంపించినట్లు ఇటీవల నిర్వహించిన ఆడిట్‌లో తేలింది. ఏషియన్ సంస్థ సీఎఫ్‌వో రాజశేఖర్ యాదవ్, సీఈవో వరుణ్ మల్హోత్రా, మేనేజింగ్ పార్టనర్ సునీల్ నారంగ్ పేర్లతో చెక్కులు తీసుకుని డబ్బులు తమ ఖాతాల్లోకి మళ్లించినట్లు తేలింది. దీంతో తమ సంస్థను మోసం చేసిన విశ్వనాథరెడ్డితో పాటు సఫియా నసీర్, శశాంక్, తదితరులపై చర్యలు తీసుకోవాలంటూ నిర్మాత సునీల్ నారంగ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అద్దెకు ఇచ్చిన ఇల్లు కూల్చివేత

అడ్డుకునేందుకు జేసీ దివాకర్‌రెడ్డి వెళ్తే బెదిరింపులు

కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్,అక్టోబర్ 26: తమ వద్ద అద్దెకు తీసుకున్న ఇంటిని.. వేరొకరికి ఇచ్చే ప్రయత్నాల్లో భాగంగా కూల్చివేతలు చేపట్టడంపై ప్రశ్నించేందుకు వెళ్లిన మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి, మేనేజర్‌లను బెదిరింపులకు గురిచేయడంతోపాటు దాడికి యత్నించారు. ఈ సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత జేసీ దివాకర్‌రెడ్డికి జూబ్లీహిల్స్ రోడ్ నం.62లోని ప్లాట్ నంబర్ 1250లో ఉన్న ఇంటిని సాహితీ సంస్థ చైర్మన్ బూదాటి లక్ష్మీనారాయణకు 2020లో అద్దెకు ఇచ్చాడు. మూడేళ్ల గడువు ముగిసిన తర్వాత ఇంటిని ఖాళీ చేయాలని కోరగా.. బూదాటి కొడుకు సాత్విక్ మిస్టిక్ వెల్‌నెస్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఓ బోగస్ అగ్రిమెంట్‌ను సృష్టించి కోర్టులో కేసు వేశాడు. ఈ వ్యవహారంపై గతంలోనే సివిల్, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలా ఉండగా వారం రోజుల క్రితం జేసీ దివాకర్‌రెడ్డి తోపాటు అతడి మేనేజర్ జగదీశ్ యాదవ్‌లు ప్లాట్ నంబర్ 1250లో ఉన్న ఇంటి వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న ఇంటిని కూల్చేసి స్థలాన్ని చదును చేస్తున్నట్లు గుర్తించిన జేసీ షాక్‌కు గురయ్యారు. ఏడాది కాలంనుంచి అద్దె చెల్లించకపోవడంతో పాటు కోర్టులో తప్పుడు పత్రాలతో కేసులు వేశారని, తమ అనుమతి లేకుండా ఇంటిని ఎలా కూలుస్తారంటూ అక్కడున్న రాజీవ్ సాల్మన్ అనే వ్యక్తిని ప్రశ్నించారు. దీంతో రాజీవ్ సాల్మన్‌తో పాటు ఇతర వ్యక్తులు జేసీ దివాకర్‌రెడ్డి, జగదీశ్ యాదవ్‌లను అక్కడినుంచి వెళ్లిపోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇంటిని కూల్చిన ఫొటోలు తీసేందుకు యత్నించడాన్ని అడ్డుకున్నారు.ఈ స్థలాన్ని సినిమా వాళ్లకు అద్దెకు ఇచ్చారని, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేసేందుకు యత్నిస్తున్నారంటూ జగదీశ్‌యాదవ్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీట్లు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం

బంజారాహిల్స్, అక్టోబర్ 26: మెడికల్, ఇంజినీరింగ్ సీట్లు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మించి పలువురు బాధితుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసిన మోసగాడిపై జూబ్లీహిల్స్ పోలీసులు చీటింగ్ కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీనగర్ కాలనీలో రోహిత్ అనే వ్యక్తి ఆరునెలల క్రితం చెక్‌మేట్ కన్సల్టెన్సీ పేరుతో కార్యాలయం ఏర్పాటు చేశాడు. విదేశాల్లో మెడిసిన్ సీట్లు, మేనేజ్‌మెంట్ కోటాలో ఇంజినీరింగ్ సీట్లు ఇప్పిస్తానంటూ నమ్మించి పలువురివద్దనుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశాడు. అయితే నెలలు గడిచినా సీట్లు రాకపోవడంతో పాటు రోహిత్ బిచాణా ఎత్తేయడంతో శనివారం పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. రంగారెడ్డి నగర్‌కు చెందిన పరశురామ్ కుమార్తెకు ఈ కాలేజీలో మేనేజ్‌మెంట్ కోటా కింద సీటు ఇప్పిస్తానంటూ రూ.12లక్షలు వసూలు చేసి మోసం చేశాడు. కృష్ణదేవరాయనగర్‌కు చెందిన పాగల నందిని వద్దనుంచి విదేశాల్లో ఉద్యోగం పేరుతో రూ.7లక్షలు వసూలు చేయగా, శ్రీనగర్ కాలనీకి చెందిన రచ్చ నవిత కుమార్తెకు వైజాగ్‌లోని గీతం యూనివర్సిటీలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానంటూ రూ.15లక్షలు వసూలు చేశాడు. ఆఫీసు ఏర్పాటు కోసం అంటూ అనురాధ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న రావి గౌతమి వద్దనుంచి రూ.70లక్షలు తీసుకున్న రోహిత్.. వివిధ కారణాలు చెబుతూ కాలయాపన చేశాడు. ఇటీవల గట్టిగా డబ్బులు ఇవ్వాలని కోరగా బాండ్ పేపర్ రాసిచ్చి అక్టోబర్ 25లోగా ఇస్తానంటూ హామీ ఇచ్చాడు. అయితే డబ్బులు ఇవ్వకపోగా ఆఫీసు మూసేసి పరార్ కావడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా చీటింగ్ కేసులు నమోదు చేశారు. రోహిత్ చేతిలో మోసపోయిన బాధితులు వందల సంఖ్యలో ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభినందన..

విస్టా ఇంటర్నేషనల్ స్కూల్ స్పోర్ట్స్ మీట్‌లో విజేతలను శనివారం అభినందిస్తున్న భారత మాజీ వాలీబాల్ ప్లేయర్ కిరణ్‌రెడ్డి

యూపీఎస్‌సీ సాధనకు ప్రణాళిక అవసరం

నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ'ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ సాధనపై అవగాహన

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఏడీ వివేకానంద

మేడ్చల్, అక్టోబరు 26: ప్రణాళికాబద్ధ కృషితో యూపీఎస్‌ను సాధించవచ్చని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఏడీ వివేకానంద అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ ఐటీ కళాశాలలో శనివారం'నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ' ఆధ్వర్యంలో రాష్ట్ర, కేంద్ర పబ్లిక్ సర్వీసుల పరీక్ష సాధనపై 'సివిల్ సర్వీసెస్-గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ కెరీర్ ఫర్ ఏ ఫ్రెష్ గ్రాడ్యుయేట్' పేరుతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది ఐఏఎస్ కావడం చాలా కష్టమని భావిస్తారన్నారు. కానీ ఏ సబ్జెక్టులో డిగ్రీ పూర్తి చేసినా యూపీఎస్‌సీ సాధించడం కష్టమేమీ కాదన్నారు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఎంతో మంది విద్యార్థులు పౌర సేవలపై ఉన్న మక్కువతో యూపీఎస్‌సీ సాధిస్తున్నారన్నారు. యూపీఎస్‌సీ సాధనకు సరియైన శిక్షణ, ప్రణాళిక అవసరమన్నారు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే రెండేండ్లలో సివిల్ సర్వీసెస్ పరీక్ష సాధించవచ్చన్నారు. తాము ఎంచుకున్న విషయంలో విస్తృతం పరిజ్ఞానం ఉంటే సులభంగా రాష్ట్ర, కేంద్ర పబ్లిక్ సర్వీసుల్లోకి రావచ్చని చెప్పారు. సివిల్ సర్వీసెస్‌లోకి రావడం అంటే ఒక్క ఉద్యోగ భద్రతనే కాదు సమాజంలో మార్పు కూడా తీసుకురావచ్చన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. ఎలా యూపీఎస్‌సీకి సిద్ధం కావాలని, ఏ ఏ విషయాలపై అవగాహన పెంచుకోవాలి తదితర విషయాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయన అవగాహన కల్పించారు. రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ రమణ ముప్పాల మాట్లాడుతూ యూపీఎస్సీ ప్రకటన ప్రతి ఏడాది వస్తుందని, ఒక్క అభ్యర్థి ఆరుసార్లు పరీక్షకు హాజరు కావచ్చన్నారు. అభ్యర్థులు గతంలో రాష్ట్ర, కేంద్ర పబ్లిక్ సర్వీసెస్ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన అభ్యర్థులను ఆదర్శంగా తీసుకొని, ముందుకెళ్లాలని సూచించారు. డైరెక్టర్ జంగారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సదస్సులతో విద్యార్థులు వ్యక్తిగతంగా, వృత్తి పరంగా అభివృద్ధి సాధించే అవకాశం ఉంటుందన్నారు. కళాశాలలో సదస్సు నిర్వహించిన తెలంగాణ టుడే, నమస్తే తెలంగాణ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రావు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, నమస్తే తెలంగాణ సర్క్యులేషన్ మేనేజర్ గణేశ్, అసిస్టెంట్ మేనేజర్ కేఆర్ ప్రసాద్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్‌లకు శాశ్వత భవనాల నిర్మాణానికి చర్యలు

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో కాప్రా ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్ష కార్యదర్శులు యు.శ్రీనివాస్, శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, కోశాధికారి నర్సింగ్‌కు పదవీబాధ్యతలు అప్పగిస్తున్న రాష్ట్ర టీయూడబ్ల్యూజే కోశాధికారి వెంకట్ రెడ్డి

కాప్రా, అక్టోబర్ 26: కాప్రా,ఉప్పల్‌లలో ప్రెస్‌క్లబ్‌లకు శాశ్వత భవనాల నిర్మాణం కోసం అన్ని చర్యలు తీసుకుంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఏఎస్‌రావునగర్ డివిజన్ అణుపురం కమ్యూనిటీహాల్‌లో జరిగిన కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, టీయూడబ్ల్యుజే-ఐజేయూ రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు ఉల్లోజు శ్రీనివాస్, వేముల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కు, ఇతర కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీ యూడబ్లుజే రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్‌రెడ్డి , కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి యాదవ్, జే.ప్రభుదాస్, పి.దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొత్తరామారావు, పి.పావనీమణిపాల్‌రెడ్డి, జి.శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, సాయిజెన్‌శేఖర్, వర్కింగ్ జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షులు బాలరాజు, కార్యదర్శి వెంకట్రామ్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న బిగ్ సీ హెచ్‌ఆర్ హెచ్‌వోడీ రామ్మోహన్ రెడ్డి

మేడ్చల్, అక్టోబరు 26 : విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని బిగ్‌సీ మానవ వనరుల విభాగం హెచ్‌వోడీ రామ్మోహన్ రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను కళాశాల మొదటి ఏడాది నుంచే నిర్దేశిత లక్ష్యంవైపు పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ జక్కుల నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, డైరెక్టర్ మోహన్‌బాబు, ప్రిన్సిపాల్ లోకనాథం, ఎంబీఏ హెచ్‌వోడీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ షాప్‌ను తొలగించాలి

రామంతాపూర్,అక్టోబర్ 26: రామంతాపూర్ టీవీ కాలనీ వెలసిన లిక్కర్ వైన్ షాప్ వల్ల కేటీఆర్‌నగర్,సాయికృష్ణానగర్ , టీవీ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే దాన్ని తొలగించాలని కోరుతూ శనివారం ఎక్సైజ్ కమిషనర్ కు పీపుల్స్ ఫోరం టు అచీవ్ రైట్స్ ఎడ్యుకేషన్ ఇండియా వ్యవస్థాపకులు న్యాయవాది కొండ్రోన్ పల్లి గిరిబాబు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు నర్సింహ,ప్రధాన కార్యదర్శి ఓంకారం సంతోష్ జాయింట్ సెక్రటరి భిక్షపతి ఉన్నారు.

ఘట్‌కేసర్ కమిషనర్‌గా బి.చంద్రశేఖర్

ఘట్‌కేసర్,అక్టోబర్26: ఘట్‌కేసర్ కమిషనర్‌గా బి.చంద్రశేఖర్ బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కమిషనర్ ఎండీ సాబేర్ అలీ నిజాంపేట్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఘట్‌కేసర్‌కు బదిలీ అయినకమిషనర్‌మీర్‌పేట్‌నుంచి వచ్చారు.

నాగారం మున్సిపల్ కమిషనర్‌గా పి.భాస్కర్ రెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 26: నాగారం మున్సిపల్ కమిషనర్‌గా పి.భాస్కర్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం శనివాం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ కమిషనర్‌గా పని చేసిన రాజేందర్‌కుమార్ పదవీ విరమణ కాగా, దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణికి నాగారం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు అందజేశారు. దేవరకొండ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న భాస్కర్‌రెడ్డి నాగారంకు ప్రభుత్వం బదిలీ చేసింది.

ఇంట్లో చోరీ

మల్కాజిగిరి,అక్టోబర్26:ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ జరిగిన సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్ కథనం ప్రకారం.. మచ్చబొల్లారం ప్రేమ్‌నగర్‌కు చెందిన శివరాం ప్రసాద్ ప్రైవేటుగా పనిచేస్తుంటాడు. పదిహేను రోజు క్రిం రాజమండ్రిలోని బంధువుల ఇంటికి తాళం వేసి వెళ్లారు. అల్మరాను పగులగొట్టి బంగారు ఆభరణాలు, వెండి, ఇతర వస్తువులను దొంగలు చోరీ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉప్పల్ కురుమ సంఘం ఎన్నికలు

ఉప్పల్, అక్టోబర్ 26: ఉప్పల్ కురుమ సంఘం ఎన్నికలు ఆదివారం బీరప్పగడ్డ కల్యాణ మండపం ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కురుమ యువత, మహిళాకమిటీ, ఉద్యోగ కమిటీలను ఎన్నుకుంటారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి కురుమ కులజులు హాజరుకావాలని కోరారు. ఎన్నికల నిర్వాహకులుగా గొరిగె కృష్ణ, ప్రొ.రామాంజనేయులు, డాక్టర్ ఎలేందర్ వ్యవహరిస్తారని చెప్పారు.

పటాకుల విక్రయదారులు జాగ్రత్తలు పాటించాలి

శామీర్‌పేట, అక్టోబరు 26 : పటాకుల విక్రయదారులు జాగ్రత్తలు పాటించాలని సీఐ శ్రీనాథ్ సూచించారు. దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచాను విక్రయదారులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు.

మేడ్చల్‌లో నాకాబందీ

మేడ్చల్, అక్టోబరు 26: మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం నాకాబందీ నిర్వహించారు. ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐదు పోలీసు బృందాలు కిష్టాపూర్, చెక్‌పోస్టు, పూడూరుప్రాంతాల్లో నాకాబందీలో భాగంగా వాహన తనిఖీలు చేపట్టారు. అలాగే కిష్టాపూర్‌లో నివాసం ఉంటున్న స్థానికేతరులను ఇండ్లను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా 342 వాహనాలను తనిఖీ చేశారు. అందులో సరియైన ధ్రువీకరణ పత్రాలు లేని 32 వాహనాలను సీజ్ చేశారు.

మూసీ ప్రక్షాళన కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఘట్‌కేసర్: మూసీ ప్రక్షాళన కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం ఘట్‌కేసర్ సమీపంలోని మూసీని ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి,ఎమ్మెల్యే అనిల్ కుమార్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలతో కలిసి ఘట్‌కేసర్ నుంచి ర్యాలీగా ఏదులాబాద్ మీదుగా వెళ్లి పిలాయిపల్లి మక్త అనంతారం వద్ద మూసీ నీటి ప్రవాహన్ని పరిశీలించారు.

చెరువు సుందరీకరణ చేపడతాం

ఉప్పల్, అక్టోబర్ 26: చెరువుల సుందరీకరణకు తోడ్పాటు అందిస్తున్నామని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ అన్నారు. నాచారం హెచ్‌ఎంటీనగర్ చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను కార్పొరేటర్ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గుర్రపు డెక్కను తక్షణమే తొలగించి, చెరువును సుందరీకరణ చేపట్టాలన్నారు. తొలగించిన గుర్రపు డెక్కను కార్టింగ్ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ నాయకులు సాయిజెన్ శేఖర్, సూపర్‌వైజర్ నరసింహ, నేతలు మేకల ముత్యంరెడ్డి, విఠల్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మేడ్చల్, అక్టోబరు 26 : రక్తదానం ప్రాణదానంతో సమానమని సీఎంఆర్ చైర్మన్ గోపాల్ రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ ఐటీ కళాశాలలో శనివారం స్ట్రీట్ క్రాస్ క్లబ్ స్టూడెంట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరం నిర్వహించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ ఐటీ డైరెక్టర్ జంగారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన రావు, డైరెక్టర్ ఆలీబేగ్, డీన్ డాక్టర్ వెంకట రమణయ్య, డాక్టర్ లిఖిత, మేనేజర్ దుర్గా ప్రసాద్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన కమిటీకి సన్మానం

రామంతాపూర్,అక్టోబర్ 26: పాతరామంతాపూర్‌లోని పురాతన భ్రమరాంభమల్లికార్జున స్వామి ఆలయ నూతన కమిటీని శనివారం మాజీ ఆలయ చైర్మన్ దయాకర్‌రెడ్డి పలువురు ఘనంగా సన్మానించారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో ఆలయం మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నామ్ రాజిరెడ్డి, ఎక్స్ అఫిషియో సభ్యులు మొత్కూరి శేఖర్‌బాబు,మెంబర్లు మేడిపల్లి విశాల్‌రెడ్డి, ఎరుకల సతీశ్,ముత్యాల జంగయ్య,మెంగశోభ,మొగిలి లింగం,బొడ్డు బాలయ్య,నాయకులు బోసాని పవన్,తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో నృత్యప్రదర్శనలు

ఉప్పల్,అక్టోబర్26 : ఉప్పల్‌లోని శిల్పారామంలో శనివారం సంకీర్తనలు అలరించాయి. ప్రాణవాకారం, జటాధరా, కళింగ నర్తన, సకళలోక, మాధ వ హృదయ, కల్యాణ రామ అంశాలను కళాకారులు ప్రదర్శించారు.కళాకారులు చేపట్టిన నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

చెరువులో పడి వ్యక్తి మృతి

కీసర, అక్టోబర్ 26: ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి చెరువులో పడి మృతి చెందాడు. ఈ సంఘటన కీసర పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం..నాగారం మున్సిపాలిటీ, రాంపల్లి గ్రామానికి చెందిన విక్టర్ (30) అనే వ్యక్తి శనివారం రాంపల్లిదాయరలోని జాఫర్‌కుంట చెరువులో ప్రమాదవశాత్తు పడిపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా..వారు ఘటనా స్థలానికి చేరుకొని చెరువులోనుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నం

భార్య మృతి, భర్తకు గాయాలు

పీర్జాదిగూడ, అక్టోబర్ 26: ఆర్థిక ఇబ్బందులతో ఓ భార్యభర్త ఆత్మహత్యకు యత్నించిన ఘటనలో భార్య మృతి చెందగా, భర్త, కూతురుకు గాయాలై దవాఖానలో చికిత్స పొందుతున్న ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఘట్‌కేసర్ మండలం ప్రతాపసింగారం గ్రామానికి చెందిన పగిడిమర్రి రామకృష్ణచారి, భార్య విజయలక్ష్మి(33) కూతురు, కొడుకుతో కలిసి స్థానికంగా ఉంటున్నాడు. నగరంలో కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు కావడంతో శనివారం రామకృష్ణ అతని భార్య విజయలక్ష్మి, కూతురు శ్రీ వైష్ణవితో కలిసి ఇంట్లో ఉన్న కాపర్ వైరును డైరెక్ట్ సర్వీస్ వైరు కనెక్షన్ చేసి ప్లగ్‌లో పెట్టి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే కూతురు తప్పించుకుని బయటకు వచ్చి అరవడంతో స్థానికులు వచ్చి చూసేసరికి విజయలక్ష్మి అప్పటికే మృతి చెందగా,రామకృష్ణ గాయాలతో బయట పడ్డాడు. అనంతరం వారిని ఓ దవాఖానకు తరలించారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు విజేత స్కూల్ విద్యార్థులు ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ రామ్‌రెడ్డి.

శామీర్‌పేట, అక్టోబర్ 26 : రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ పోటీలను సద్వినియోగం చేసుకుని మండలానికి జిల్లాకు పేరు తీసుకురావాలని చైర్మన్ రామ్‌రెడ్డి అన్నారు. ఈనెల 25న వికారాబాద్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో శామీర్‌పేట మండలం తుర్కపల్లిలోని విజేత టెక్నో స్కూల్ విద్యార్థులు రంగారెడ్డి జిల్లా జట్టుకు అండర్ -17 బాలుర విభాగంలో వై.జశ్వంత్, అంకుష్‌రెడ్డి, అండర్ -14 బాలికల విభాగంలో అక్షిత, శ్రావణిలు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఆ విద్యార్థులను శనివారం పాఠశాలలో అభినందించారు. ఈనెల 28, 29, 30వ తేదీల్లో గోదావరిఖని పెద్దపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీలత, పీఈటీ ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

కార్యక్రమం ప్రారంభంలో పాల్గొన్న డైరెక్టర్ వీఎస్‌కే రెడ్డి, అధ్యాపకులు

మేడ్చల్, అక్టోబరు 26 : విద్యార్థుల ఉన్నతికి నిర్వహించే వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మార్ సెట్ డైరెక్టర్ డాక్టర్ వీఎస్‌కే రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో రెండు రోజులుగా ఎంబీఏ విద్యార్థులకు నిర్వహిస్తున్న 'ట్రస్ట్ ది మ్యాజిక్ ఆఫ్ న్యూ బిగినింగ్ ' పేరుతో రెండు రోజుల వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎదగాలంటే కేవలం విషయ పరిజ్ఞానం ఒక్కటే సరిపోదని, భావ వ్యక్తీకరణ కూడా అవసరమన్నారు. భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను వర్క్‌షాప్‌ల ద్వారా పెంపొందించుకోవాలని, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ హెచ్‌వోడీ నవీన్ కుమార్, ఏవో ప్రొఫెసర్ రాజేశ్వర్ రెడ్డి తదిరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనే ముక్తికి సోపానం

నేరేడ్‌మెట్, అక్టోబర్ 26: సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ భగవంతుడి అనుగ్రహం పొందడానికి ఉత్తమమైన మార్గంఆధ్యాత్మిక చింతనే యోగ్యమైనదని నైమిశారణ్యం పీఠాధిపతి పూజ్యశ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి అన్నారు. శనివారం ఆనంద్‌బాగ్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ వేంకటేశ్వర లీల విన్యాసం గురించి అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాణాధికారి ఏబీ రవీందర్ రెడ్డి, ప్రధాన అర్చక స్వాములు పీఠాధిపతికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అర్చకులు తులసివెంకట రమణా చార్యులు, కొండపాక వేణుగోపాల చార్యులు, క్లర్క్ సంద్ర సుధాకర్, స్వామివారి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రవచనం చేస్తున్న పీఠాధిపతి పూజ్యశ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి

జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

ఉప్పల్,అక్టోబర్ 26: నిరుద్యోగ యువతి, యువకులు జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో సీఐఏ భవనంలో ఎస్‌జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఐఏ, వాసవి ఇంటర్నేషనల్ క్లబ్‌లో సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళా మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌తో కలిసి సందర్శించి నిరుద్యోగ యువతి, యువకులకు పలు సూచనలు చేశారు. మూడు వందలకు పైగా నిరుద్యోగులకు నియమాక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐఏ అధ్యక్ష, కార్యదర్శులు గోవింద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఐలా చైర్మన్ రోషిరెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌జీ ఫౌండేషన్ చైర్మన్ గాండే సుధాకర్, వాసవి ఇంటర్నేషనల్ క్లబ్ ప్రతినిధులు పచ్చిపులుసు శ్రీనివాస్, పసునూరి శ్రీనివాస్, పారిశ్రామికవేత్తలు మందా సురేశ్, రాము, శ్రీనివాస్, కిషోర్‌కుమార్, మోహన్, రాంచందర్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, లతో పాటు పెద్ద సంఖ్యలో పారిశ్రామికవేత్తలు, వివిధ కాలేజీలకు చెందిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాగారాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

నాగారం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 26: నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు రాజ్‌సుఖ్ నగర్, గౌరి ఎన్‌క్లేవ్, 20వ వార్డు గోపికృష్ణ కాలనీ, 6వ వార్డు వికాస్ నగర్ కాలనీల్లో రూ. 18 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం చైర్మన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు, నాయకులు. వివిధ కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

శివాలయ హరిహర క్షేత్రానికి విరాళం

ఉప్పల్, అక్టోబర్ 26: చిలుకానగర్‌లోని హరిహర క్షేత్రం శివాలయం పునఃనిర్మాణానికి ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దేవసాని బాలచందర్ విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయ కమిటీ ప్రతినిధులు శనివారం బాలచందర్-చంద్రకళ దంపతులను సత్కరించి, ఆశీర్వచనం అందజేశారు. ఆలయ నిర్మాణానికి బాలచందర్ రూ.5 లక్షల విరాళం ప్రకటించారు. ఇందులో భాగంగా శనివారం రూ.1 లక్షను అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు దాసరి కృష్ణ, కమిటీ సభ్యులు పాల్వంచ విఠల్, గోనె అంజయ్య, విద్యాసాగర్, శామీర్‌పేట చంద్రయ్య, శంభుప్రసాద్, అంజయ్య, స్వామి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్‌కు ఎదుట వాదనలు వినిపించాలి

సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారికి వినతి పత్రం సమర్పిస్తున్న బీసీ సంఘాల ప్రతినిధులు

మేడ్చల్, అక్టోబరు 26 : బీసీ సంఘాలు బీసీ కమిషన్ ఎదుట తమ రిజర్వేషన్ల విషయమై వాదనలను వినిపించాలని సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ముజాహిద్ ఖాన్ సంఘాల నేతలకు సూచించారు. శనివారం ఆయన కలెక్టర్‌లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో జిల్లాలో అత్యంత వెనుకబడిన తరగతుల సంఘాల నాయకులు, ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 7వ తేదీన రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలోని తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ జరుపనున్నట్టు తెలిపారు. కులాల స్థితిగతులపై స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషా విషయంలో అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమిషన్ ముందుంచాలని బీసీ సంఘాలకు సూచించారు. ఈ సమావేశంలో సంచార జాతుల ఎంబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాండు వంశరాజ్, ఉపాధ్యక్షుడు జెల్లి స్రవాంత్, మందుల కుల సంఘం నాయకులు మల్లేశ్, బుక్క అయ్యావారు కుల సంఘం నాయకుడు సతీష్, మధు, శ్రీకాంత్, బుడబుక్కల కుల సంఘం నాయకులతో పాటు అత్యంత వెనుకబడిన తరగతుల కులాల ప్రతినిధులు పాల్గొన్నారు.